క్లుప్తంగా

ఏకరూప దుస్తులు పరిశీలన



కుట్టిన దుస్తులను పరిశీలిస్తున్న డీఈవో

తాండూర్/మందమర్రిరూరల్: తాండూర్, మందమర్రి మండలాల్లో ఏర్పాటు చేసిన విద్యార్థుల యూనిఫామ్ స్టిచ్చింగ్ సెంటర్లను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.యాదయ్య ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల ఏకరూప దుస్తుల యూనిఫాంలను నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశించిన గడువు ప్రకారం కుట్టు పని పూర్తి చేయాలని సూచించారు. డీఈవో వెంట మందమర్రిలో ఎంఈవో దత్తుమూర్తి, తాండూర్‌లో ఎంఈవో ఎస్.మల్లేశం, జిల్లా సెక్టోరల్ అధికారి కె.చౌదరి, డీసీఈబీ సెక్రెటరీ మహేశ్వరరెడ్డి, సీఆర్పీ తిరుపతి, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

కరాటే పోటీల్లో లింగాపూర్ వాసి ప్రతిభ



ప్రశంస పత్రం అందుకుంటున్న లక్ష్మణ్

దండేపల్లి: హైదరాబాద్‌లో ఇటీవల మంకీ ఫిస్ట్ స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా అకాడమీ ఆధ్వర్యంలో సీనియర్ మాస్టర్ల కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల లక్ష్మణ్ అత్యంత ప్రతిభ కనబరిచి స్పారింగ్‌లో రెండో బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో నేషనల్ గ్రాండ్ మాస్టర్ మదన్‌కుమార్, మంకీఫిస్టు కుంగ్‌ఫూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి రాజారావు, కార్యదర్శి అంజన్న పాల్గొన్నారు.

పరామర్శ



రవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న బెల్లంపల్లి మున్సిపల్ మాజీ కౌన్సెలర్, సీనియర్ ద్వితీయ శ్రేణి నాయకుడు గుజ్జ రవిని ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరామర్శించారు. మంగళవారం ఉదయం రవి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే ఆయన ఆరోగ్యస్థితి గతులను అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. మనో నిబ్బరం కోల్పోకుండా ఉండాలని, తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే అభయం ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్మెన్ మత్తమారి సూరిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పాఠశాలల సందర్శన



పాఠశాలను పరిశీలిస్తున్న దుర్గప్రసాద్

దండేపల్లి: మనఊరు–మనబడిలో ఎంపికైన దండేపల్లి మండలంలోని మామిడిపల్లి, మోకాసిగూడ, తాళ్లపేట, గుడిరేవు, లక్ష్మీకాంతపూర్, వెల్గనూర్, రంగంపల్లె, గూడెం, రెబ్బనపల్లి గ్రామాల్లో పాఠశాలలను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, దండేపల్లి మండల ప్రత్యేకాధికారి దుర్గప్రసాద్ మంగళవారం సందర్శించారు. మనఊరు–మనబడిలో చేపట్టిన పనులపై ఆరా తీశారు. మిగిలిన పనులు ఎందుకు పూర్తిచేయలేదో గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ అరుణ్, సీఆర్పీలు ఉన్నారు.

ఫోన్లు అప్పగింత

చెన్నూర్: సాంకేతిక పరిజ్ఞానంతో పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసినట్లు సీఐ దేవేందర్ రావు తెలిపారు. గతంలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఐదు ఫోన్లను గుర్తించి మంగళవారం బాధితులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. సహకరించిన పోలీసు సిబ్బంది జయకృష్ణ, జీవన్ రావు, ఖదీర్‌లను సీఐ అభినందించారు. కార్యక్రమంలో బాధితులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమిని: కన్నెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 33కేవీ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రాజనర్సు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని జన్కాపూర్, కన్నెపల్లి, భీమిని, నాయకునిపేట గ్రామాల్లో ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుర్గంధం భరించలేకపోతున్నాం..!



లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు విచ్చలవిడిగా పారుతోంది. స్థానిక ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతున్నారు.

మొక్కలు ఎండుతున్నయ్..!

భీమారం: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ద్వారా జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పెంచుతున్న వన నర్సరీలో మొక్కలు ఎండిపోతున్నాయి. సక్రమంగా నీటిని అందించకపోవడంతో పాటు వాటికి సరైన రక్షణ చర్యలు చేపట్టలేదు.



బోరువేశారు.. హ్యాండీల్ మరిచారు!



దండేపల్లి: మండలంలోని చింతపల్లి గ్రామంలో గల వైకుంఠధామం వద్ద నీటి వసతి కోసం బోరు వేశారు. కానీ దానికి హ్యాండీల్ గాని, మోటారు గాని ఏదీ బిగించకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి బోరుకు హ్యాండీల్ లేదా మోటారు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

‘అనర్హుల పేర్లు తొలగించండి’



డీపీవో కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న ఏమాజీ

నెన్నెల/బెల్లంపల్లి: అర్హులైన నిరుపేదలను విస్మరించి కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారా అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ విమర్శించారు. పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల ఎదుట వేర్వేరుగా ధర్నా చేశారు. నెన్నెల బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్‌తో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కాంగ్రెస్ కార్యకర్తల పేర్లు ఉన్నాయని, నాయకులు, కుటుంబ సభ్యుల పేర్లతో ఇళ్లు మంజూరు చేయడం సరికాదన్నారు. నిరుపేదలకు చెందాల్సిన ఇళ్లను అనర్హులకు కేటాయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనర్హులైన కాంగ్రెస్ నాయకుల పేర్లను బేషరతుగా జాబితాలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం డీఏవో కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి, జిల్లా కార్యదర్శి కోయిల్‌కార్ గోవర్ధన్, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, శ్రేణులు శ్రావణ్, నవీన్‌కుమార్, నర్సింగ్, అరవింద్, స్రవంతి, సుమలత, శ్రీనివాస్, రాములు, రాజయ్య, నెన్నెల బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మే డే విజయవంతం చేయండి



జన్నారం: మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

జన్నారం: మే 1న అన్ని గ్రామాల్లో మే డేను ఘనంగా జరుపుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. జన్నారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల నాయకుల సమావేశం సీఐటీయూ మండల కన్వీనర్ అంబటి లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. మే డే విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో కనికరపు అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లింగన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చయ్య, సీపీఎం నాయకులు రాజన్న, సీఐటీయూ నాయకులు, ఆత్రం రాజు, ఆదివాసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భీమిని: మే డే ను విజయవంతం చేయాలని పీవైఎల్, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు అన్నారు. కన్నెపల్లి, భీమిని మండలాల్లోని మెట్టుపల్లి, ఖర్జీభీంపూర్ గ్రామాల్లో మంగళవారం మే డే పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్మ మనోహర్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ భీమిని కార్యదర్శి చింతపురి బాపురావు, నాయకులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తిస్తే గుర్తింపు



సంజీవ్‌రావు దంపతులను సన్మానిస్తున్న రేంజ్ అధికారి

జన్నారం: ప్రభుత్వ ఉద్యోగ ధర్మంలో విధులు సక్రమంగా నిర్వర్తించి సేవలందిస్తే ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ అన్నారు. ఇందన్‌పల్లి రేంజ్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన మేకల సంజీవరావు దంపతులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంజీవరావు అటవీశాఖలో తన 41సంవత్సరాల సర్వీసు ఎలాంటి మచ్చలేకుండా పూర్తి చేసి, ఉద్యోగ విరమణ పొందారని అభినందించారు. ప్రతి ఉద్యోగికి పదోన్నతులు, బదిలీలు, ఉద్యోగ విరమణ అనేవి సాధారణమని, కాని ఉద్యోగ ధర్మంలో ఎలాంటి చెడ్డపేరు లేకుండా విరమణ పొందడమే గొప్పతనమన్నారు. ప్రతి ఉద్యోగి తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. కార్యక్రమంలో జన్నారం రేంజ్ అధికారి సుష్మారావు, సెక్షన్ అధికారులు రవి, హన్మంతరావు, సునీల్, తన్వీర్‌పాషా, ముజీబోద్దీన్, బీట్ అధికారులు పోశన్న, రవి, బానయ్య, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హైటెక్‌సిటీ కాలనీ సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ శివాజీకి వినతిపత్రం ఇస్తున్న హైటెక్‌సిటీ కాలనీవాసులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని హైటెక్‌సిటీ కాలనీలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరుతూ హైటెక్ సిటీ కాలనీవాసులు మంగళవారం కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందించారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. కాలనీలోని రిలయన్స్ సంస్థ స్థలంలో పెరిగిన చెట్లు, పొదల వల్ల విష సర్పాలు, పాములు ఎక్కువగా తిరుగుతూ సమీప కాలనీలోని ఇళ్లకు వస్తున్నాయన్నారు. కాలనీ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, ఖాళీ స్థలాల్లో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించి, విషపు సర్పాలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్య కొంత తీరినా, ఇతర ప్రాంతాల్లో చాంబర్ల నుంచి లీకేజీ అవుతూ దుర్వాసన వస్తుందని, డ్రెయినేజీ నీరు రోడ్లపైకి రాకుండా చూడాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



ఎద్దు వద్ద విలపిస్తున్న యజమాని

భీమిని: వేటగాళ్లు అమర్చిన విద్యుత్ వైర్లకు తగిలి ఎద్దు మృతి చెందిన సంఘటన కన్నెపల్లి మండలంలోని మెట్టుపల్లి శివారులో చోటుచేసుకుంది. మెట్టుపల్లి గ్రామానికి చెందిన బోర్ల శ్రీనివాస్, నారాయణ సోమవారం రాత్రి ఎద్దుల బండితో లింగాల గ్రామానికి వెళ్తున్నారు. మెట్టుపల్లి గ్రామ శివారులో కొంతమంది రైతులు బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్‌కు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వన్య ప్రాణులు, అడవి పందులను వేటాడానికి జే వైర్‌తో విద్యుత్ ఉచ్చు అమర్చారు. అది గమనించకపోవడంతో ఒక ఎద్దుకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించింది. మరో ఎద్దును త్వరగా బండి నుంచి తప్పించడంతో, ఎద్దుతో పాటు వారిద్దరికి ప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు అమర్చిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితుడు శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

ఎర్లీ బర్డ్ స్కీంకు నేడే ఆఖరు



ఇంటి పన్ను చెల్లిస్తున్న ప్రజలు

మంచిర్యాలటౌన్: కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ముందస్తు పన్ను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 5శాతం రిబేటుతో తీసుకొచ్చిన ఎర్లీబర్డ్ స్కీం పథకం నేటితో ముగియనుంది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో రూ.27కోట్ల వరకు ఆస్తి పన్ను డిమాండ్ ఉండగా, మంగళవారం వరకు రూ.3.25కోట్ల పన్ను వసూలయ్యింది. బుధవారం చివరి రోజు కావడంతో, పన్ను చెల్లించేందుకు ఒక్క రోజు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శివాజీ తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

- శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారంటూ మండిపాటు
- సింగరేణి సివిల్ కార్యాలయాల ఎదుట ధర్నా



రామకృష్ణాపూర్: ధర్నా చేస్తున్న కార్మికులు



శ్రీరాంపూర్: ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్/రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్/బెల్లంపల్లి: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ, ఇఫ్టూ శ్రేణుల ఆధ్వర్యంలో మంగళవారం బెల్లంపల్లి సింగరేణి సివిల్ కార్యాలయం ఎదుట, రామకృష్ణాపూర్ సివిల్ కార్యాలయం ఎదుట, శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట, మందమర్రి ఏరియా సివిల్, జీఎం ఆఫీస్ వద్ద ఆందోళన, ధర్నా చేశారు. సింగరేణి వ్యాప్తంగా 35వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తుండగా, తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ దోచుకుంటున్నారని పేర్కొన్నారు. కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనం చెల్లించాల్సి ఉన్నా, అమలు కావడం లేదని తెలిపారు. ఏరియా ఆసుపత్రుల్లో కాంట్రాక్టు కార్మికులకు వైద్యసేవలు కల్పించాలని, సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో సివిక్ కార్యాలయం సూపర్‌వైజర్ ప్రదీప్‌కు వినతి పత్రం అందజేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో శ్రీరాంపూర్‌లో ఐఎఫ్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, యాదగిరి రాజన్న, అప్పారావు, సదానందం, శ్రీనివాస్ బాబు, రాజన్న, శంకర్, అప్పలరాజు, బెల్లంపల్లిలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్, ఇఫ్టూ శ్రేణులు వెంకటి, శ్రీనివాస్, కొమురయ్య, వెంకటేష్, బానుకుమార్, అరుణ్, కృష్ణవేణి, గణేష్, లత, సునీత, దేవమ్మ, రామకృష్ణాపూర్‌లో నాయకులు గజ్జి మల్లేష్, మల్లన్న, శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: కనీస వేతనాల సలహా మండలి తీర్మానాలను అమలు చేసి సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఏఐటీయూసీ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందించారు. కనీస వేతనాల సలహా మండలిలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో కనీస వేతనాల సలహా మండలి సభ్యుడు యూసుఫ్, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అక్బర్‌అలీ, అఫ్రోజ్‌ఖాన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ర్యాంకర్‌ను అభినందించిన సీఎండీ



వైష్ణవిని అభినందిస్తున్న సీఎండీ బలరాంనాయక్

శ్రీరాంపూర్: ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించిన కార్మికుడి కూతురు వైష్ణవిని సింగరేణి సీఎండీ బలరాంనాయక్ అభినందించారు. ఆర్కే 5గనిలో జనరల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రెంక చంద్రమౌళి కూతురు వైష్ణవి ఇంటర్ మొదటి సంవత్సరంలో 440మార్కులకు గాను 437మార్కులు సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని సీఎండీ కార్యాలయంలో వైష్ణవితో పాటు ఆమెను ప్రోత్సహించిన తల్లిదండ్రులను సీఎండీ అభినందించారు.

ఉత్సాహంగా మైనింగ్ స్టాఫ్ ఆత్మీయ సమ్మేళనం



శ్రీరాంపూర్: మైనింగ్ స్టాఫ్ సిబ్బంది ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. మూతపడిన సింగరేణి ఎస్సార్పీ 2 గనిలో 1979–2006లో పనిచేసిన మైనింగ్ స్టాఫ్ సిబ్బంది మంగళవారం మంచిర్యాలలో కలుసుకున్నారు. గనిలో పనిచేసి రిటైర్డ్ అయ్యి ఎక్కడెక్కడో నివాసం ఉంటున్న వారందరూ, ఒక్కచోట కలుసుకొని జ్ఞాపకాలను, నాటి పని అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం క్వార్టర్ల కేటాయింపు కోసం సూపర్‌వైజర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. 20క్వార్టర్లకు నోటిఫికేషన్ ప్రకటించగా 10మంది సూపర్‌వైజర్స్ దరఖాస్తు చేసుకున్నారు. 8మందికి సీనియార్టీ ప్రకారం క్వార్టర్లు కేటాయించినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ తెలిపారు. కౌన్సెలింగ్‌లో ఏరియా ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, డీవైపీఎం మైత్రేయబంధు, మేనేజ్మెంట్ ట్రైనీ ఐఈడీ శ్యామ్ పాల్గొన్నారు.

4న జిల్లా స్థాయి చెస్ పోటీలు

మందమర్రిరూరల్: వచ్చే నెల 4న జిల్లా స్థాయి అండర్ 15 బాల బాలికల చెస్ పోటీలు స్థానిక బురదగూడెంలోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్లో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా చెస్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఈగ కనుకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెల 10న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు 3న సాయంత్రం లోగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 89781 46456 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

శ్రీరాంపూర్: కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలు నియంత్రణ సులువు అవుతుందని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఝాన్సీ నగర్‌లో మంగళవారం కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

నేడు భూభారతి చట్టంపై అవగాహన

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్లో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు భూభారతి ఆర్.ఓ.ఆర్.చట్టం 2025పై అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దార్ రహమతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కుమార్‌దీపక్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి ప్రజలు హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

బెల్లంపల్లి: మండలంలోని చంద్రవెల్లిలో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో మహేందర్, గ్రామ పంచాతీయతీ ప్రత్యేక అధికారి ప్రేమ్ కుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్యామల, సూపరింటెండెంట్ వేణుగోపాల్, ఐకేపీ సీసీ సుందరేష్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, మహిళలు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

లక్సెట్టిపేట: దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన బెంబడి సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రూ.ఇరవై లక్షల ప్రమాద బీమా చెక్కును మృతుడి తమ్ముడు రాజ్‌కుమార్‌కు మంగళవారం రీజనల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్త అందజేశారు.

ఆర్థిక సాయం

చెన్నూర్: పట్టణానికి చెందిన మౌనిక అనే మహిళ ఫొటోగ్రాఫర్ వివాహానికి తోటి ఫొటో గ్రాఫర్స్ రూ.58,674 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మహిళ ఫొటోగ్రాఫర్ లలిత, రోజారాణి, లావణ్య, రెడ్డి బాస్కర్, శనిగారపు మల్లేశ్, మక్సూద్, రఘు, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

నెన్నెల: ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, కార్యదర్శి సురేష్ మంగళవారం మండల కేంద్రంలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు.

మే 20న సమ్మెలో పాల్గొనాలి

శ్రీరాంపూర్: దేశ వ్యాప్తంగా మే 20న జరిగే సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమార్ స్వామి, సమ్ము రాజయ్య తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని, ఎస్సార్పీ 1, ఎస్ఆర్పీ 3, 3ఏ, ఆర్కే 6గని, ఆర్కే 7, ఆర్కే 8 గనులపై మంగళవారం కార్మికులను కలిసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, కార్మిక చట్టాల సవరణను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రాజేష్ తెలిపారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో మంగళవారం కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏ.రాజు, లింగన్న, బాపు తదితరులు ఉన్నారు.